క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

నందిగామ: నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో మేలు చేస్తుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మామిడిపల్లికి చెందిన మూల మల్లారెడ్డికి రూ.36 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కవిత శ్రీనివాస్, గ్రామస్తులు శరత్ కృష్ణ, శ్రీను, సాయికుమార్, సుదర్శన్, రామకృష్ణరెడ్డి, శరత్ కృష్ణ, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు


విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయ అధికారి

కేశంపేట: జనుము, జీలగ విత్తనాలు 65శాతం సబ్సిడీపై ఆగ్రోస్ సెంటర్‌లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి శిరీష తెలిపారు. జనుము 40 కేజీల బస్తా రూ.1225, జీలగ 30 కిలోల బస్తా రూ.842కు అందిస్తామని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం తీసుకువచ్చి సబ్సిడీ విత్తనాలను తీసుకువెళ్లాలని చెప్పారు. మంగళవారం ఆగ్రోస్ సెంటర్‌లో రైతులకు ఆమె విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కొందుర్గు: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి తమ సేవలను గుర్తించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా పెద్ద మనసుతో అందరు కార్యదర్శులను రెగ్యూలర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, అశోక్‌రెడ్డి, రాజేందర్, నర్సింలు, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి


దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏఓ

కొందుర్గు: రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని జిల్లేడ్ చౌదరిగూడ మండల వ్యవసాయాధికారి కృష్ణమోహన్ సూచించారు. మంగళవారం చౌదరిగూడ, లాల్‌పహాడ్ గ్రామాల్లో విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. బిల్లులు, లైసెన్స్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని, బిల్లుపై కాలపరిమితి తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్ నమోదు చేయాలన్నారు.

జీవవైవిధ్యంతోనే మనుగడ

జీవవైవిధ్య మండలి సభ్యురాలు విశాల


కార్యక్రమంలో పాల్గొన్న విశాల, అధికారులు

కేశంపేట: మానవ మనుగడ జీవవైవిధ్యంతో ముడిపడి ఉంటుందని స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్, జిల్లా జీవవైవిధ్య మండలి సభ్యురాలు విశాల అన్నారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా జీవవైవిధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విశాల మాట్లాడుతూ... జీవవైవిధ్యంతోనే మనవుని జీవనం సాగుతోందని అన్నా రు. కార్యక్రమంలో జీవవైవిధ్య బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన

షాబాద్: మండలంలోని సంకేపల్లిగూడలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. మంగళవారం గ్రామంలో వేద పండితులు శాస్త్రోక్తంగా నవగ్రహ, శివలింగం, గణపతి, బొడ్రాయి,ఆంజనేయ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన పూజలను నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమ్మరి దర్శన్, ఎంపీటీసీ సభ్యుడు కుమ్మరి చెన్నయ్య, ఉప సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీడని నిర్లక్ష్యం



పెంజర్ల రోడ్డులో కంచలేని ట్రాన్స్‌ఫార్మర్

- ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్లు
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: జనావాసాల మధ్య ఎలాంటి రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రజల పాలిట మృత్యుపాశాలుగా మారాయి. సంబంధిత శాఖ అధికారులు ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. అలాగే, పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సరైన ఎర్తింగ్ లేని కారణంగా వర్షాలు పడితే కొద్దిదూరం వరకు షాక్ వస్తున్న సంఘటనలు చోటు చేసుకున్నాయి.

మండల కేంద్రంలో...

మండల కేంద్రంలోని నారాయణగూడ కాలనీ, పెంజర్లకు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచె లేని కారణంగా జనావాసాల మధ్య ప్రమాదభరితంగా మారాయి. నారాయణగూడ కాలనీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో చిన్నారులు ఆటలు ఆడుకుంటున్నారు. ఇక్కడ ఏ మాత్రం ఆజాగ్రత్తగా ఉన్న ప్రమాదం జరిగే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ఇక పెంజర్ల రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచి ప్రధాన రహదారి ఉండడంతో వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణం కొనసాగిస్తుంటాయి. ఏమాత్రం ఆజాగ్రత్తగా వ్యవహరించిన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

“కంచెల ఏర్పాటుకు కృషి చేస్తా



కొత్తూరు మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో శిథిలావస్థకు చేరిన, ఇళ్లపై నుంచి ప్రమాదకరంగా వెళ్తున్న విద్యుత్ తీగలను ఇప్పటికే తొలగించాం. దాంతో పాటు ప్రధానరోడ్లు, ఇళ్ల మధ్యన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచెల ఏర్పాటుకు సంబంధిత అధికారులకు సమస్యలను వివరించి పరిష్కారానికి కృషి చేస్తా.

– లావణ్య , మున్సిపల్ చైర్‌పర్సన్, కొత్తూరు


నారాయణగూడ కాలనీలో ఇళ్ల మధ్యన ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఇన్ముల్‌నర్వలో..

ఇన్ముల్‌నర్వలో ఏర్పాటు చేసిన పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. వాటిని వేరే చోటుకు మార్చడంతో పాటు ప్రమాదాలు జరగకుండా రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని పలుమార్లు గ్రామస్తులు సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోవడం లేదని అధికారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్


కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో నిర్వహించిన బస్తీబాటలో ఎమ్మెల్యే పాల్గొని క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకే బస్తీబాట కార్యక్రమం చేపట్టామని అన్నారు. షాద్‌నగర్ పట్టణం రోజు రోజుకు విస్తరిస్తుందని తెలిపారు. పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు తబ్రేజ్ తన అనుచరులతో కలసి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, కృష్ణవేణి, శ్రీశైలంగౌడ్, వెంకట్‌రావు, జంగయ్య పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు కాలం చెల్లింది

పీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంకర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

షాద్‌నగర్: బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు కాలం చెల్లిందని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు పూర్తిగా విఫలం విమర్శించారు. ప్రజా వ్యతిరేఖ విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న అన్ని నిర్ణయాలకు సీఎం కేసీఆర్ మద్దతు తెలుపుతూ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, పురుషోత్తంరెడ్డి, శ్రీశైలం, రఘు, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుదర్శన్, ఖదీర్, సీతారాం, అశోక్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణం అందరి బాధ్యత

ఎంపీడీఓ వెంకయ్యగౌడ్


ఇంకుడు గుంత నిర్మాణానికి ముగ్గు వేయిస్తున్న ఎంపీడీఓ

శంకర్‌పల్లి: ఇంకుడు గుంతల నిర్మాణంలో మహిళా సంఘాల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం శంకర్‌పల్లి మహిళా సమైఖ్య భవనంలో అన్ని గ్రామాల మహిళా సంఘాల మహిళలు, వీఓఏలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో డ్రైవ్ మోడ్‌లో చేపడుతున్న ఇంకుడు గంతల నిర్మాణంలో మహిళలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఇంటి పరిసరాలల్లో మురుగు నీరు నిల్వకు ఆస్కారం ఉండదని, దోమలు, ఈగలు ప్రబలవని చెప్పారు. ఇంటి నుంచి వృథాగా వెళ్లే నీరును ఇంకుడు గుంతలోకి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని మోకిలలో ఇంకుడు గుంత నిర్మాణానికి ముగ్గు వేయించారు. కార్యక్రమంలో ఏపీఎం బీమయ్య, ఏపీఓ నాగభూషణం, ఎంపీఓ గీత, కార్యదర్శి లక్ష్మీతులసి పాల్గొన్నారు.

నీటి పొదుపుపై అవగాహన

సీడీపీఓ శోభారాణి


సదస్సులో మాట్లాడుతున్న శోభారాణి

మొయినాబాద్ రూరల్ : గ్రామాల్లో ప్రజలు నీటి పొదుపులో భాగంగా వర్షపు నీటిని ఎలా పొదుపు చేయాలో తెలుసుకోవాల్సి అవసరం ఎంతో ఉందని చేవెళ్ల సీడీపీఓ శోభారాణి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని హిమాయత్‌నగర్ సెక్టార్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల తల్లిదండ్రులకు పలు అంశాలపై అవగాహన నిర్వహించారు. అందులో భాగంగా వర్షపు నీటిని ఎలా పొదుపు చేయాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, పౌష్టిక ఆహారంలో స్థానికంగా లభించే పండ్లు, కురగాయాలు, ఆకు కురలు ఆహారంలో తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీ, ఆయాలు పాల్గొన్నారు.

‘లక్ష్మీదేవిపల్లి’ని నిర్మించే వరకు పోరాటం

బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం శ్రీవర్ధన్‌రెడ్డితో పాటు బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, మిధున్‌రెడ్డిలు విలేకరులతో మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించే లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం 72 జీఓను జారీ చేసిందన్నారు. సీఎం కేసీఆర్ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. 9 ఏళ్లు పూర్తి అయినా ప్రభుత్వం ఈ రిజర్వాయర్ నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదన్నారు. సీఎం కేసీఆర్ కమీషన్ల కోసం ఈ ప్రాజెక్టుకు రీడిజైన్ చేసి ప్రాజెక్టు స్వరూపాన్నే మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుకు బదులుగా తాగునీటి ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్రానికి ఇచ్చిందని తెలిపారు. సరైన నివేదికలు ఇవ్వకపోతే కేంద్రం జాతీయ హోదా ఏవిధంగా ఇస్తుందని అసహనం వ్యక్తం చేశారు. కుర్చీ వేసుకొని ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ హామీ ఏమైందన్నారు. ఈ సమావేశంలో నాయకులు అశోక్‌గౌడ్, భూపాలాచారి, మనోహర్‌రెడ్డి, మురళీ, హరీశ్, శ్రీనివాస్‌చారి, ప్రవీణ్, హన్మంతు, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన కొందుర్గు విద్యార్థులు

కొందుర్గు: విజయవాడ కేఎల్ యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 20, 21 తేదీలో నిర్వహించిన 36వ సౌత్ ఇండియా కుంగ్‌ఫూ కరాటే టోర్నమెంట్‌లో కొందుర్గు విద్యార్థులు ప్రతిభ చాటారని మంగళవారం మాస్టర్ రమేష్ తెలిపారు. అండర్ 17 బాలుర విభాగంలో కాస్లాబాద్ సురేష్ బంగారు పతకం సాధించగా, బంటి సిల్వర్ పతకం , కిరణ్‌కుమార్ మెడల్ సాధించారన్నారు. అదేవిధంగా అండర్ 12 కటాస్ విభాగంలో నహీద్, రోహిత్ గోల్డ్ మెడల్, వంశీ, అభినయ్ సిల్వర్ మెడల్ సాధించారని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కుంగ్‌ఫూ అసోషియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజేష్‌పటేల్, మండల కమిటీ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి అభినందించారు.

మార్కెట్ యార్డు సందర్శన


రైతులతో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

షాద్‌నగర్: పట్టణ శివారులో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డును మంగళవారం బీజేపీ నేతలు సందర్శించారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం వరిధాన్యం కొనుగోలు తీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరిధాన్యం కొనుగోలులో తరుగుతీయొద్దని, రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. మార్కెట్ యార్డులో రైతులకు కావాల్సిన సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారని విమర్శించారు. టార్పాలిన్ కవర్లు, ధాన్యం బస్తాలు రైతులకు సరిపడా పంపిణీ చేయాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, భూపాలాచారి, విష్ణువర్ధన్‌రెడ్డి, మిధున్‌రెడ్డి, మురళీ, శ్రీనివాస్‌చారి, హన్మంత్ పాల్గొన్నారు.

జేపీఎస్‌ల రెగ్యులరైజ్‌పై హర్షం


శంకర్‌పల్లి: స్వీట్లు తినిపించుకుంటున్న జేపీఎస్‌లు

చేవెళ్ల: జేపీఎస్‌లను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం జేపీఎస్‌లు, ఎంపీడీఓ రాజ్‌కుమార్, ఎంపీఓ విఠలేశ్వర్‌జీలతో కలిసి సంతోషం వ్యక్తం చేసి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా జేపీఎస్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఇటీవల సమ్మెకు దిగిన తమను ప్రభుత్వం జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేస్తామని సమ్మె విరమించాలని కోరడంతో ప్రభుత్వ అదేశాలను పాటించి సమ్మెను విరమించి విధుల్లో చేరినట్లు తెలిపారు. రెగ్యులర్ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

జేపీఎస్‌ల సంబరాలు

శంకర్‌పల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీసు క్రమబద్ధీకరణకు సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించడంతో సంతోషం వ్యక్తం చేస్తూ మండల పరిషత్ కార్యాలయంలో జేపీఎస్ స్వీట్లు తినిపించుకున్నారు.

కళాశాల ఏర్పాటు చేయండి

కొత్తూరు: మండలంలో ఈ ఏడాదైన ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసేలా పాలకులు, విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ మండల కన్వీనర్ నరేష్‌చారి మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. స్థానికంగా జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు షాద్‌నగర్, శంషాబాద్‌ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. కావున, కళాశాలను ఏర్పాటుకు కృషి చేయాలని ఆయన కోరారు.

బీజేపీనే గెలిపించండి

బీజేపీ నేత నర్సింహయాదవ్

కేశంపేట: రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు బీజేపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పసుల నర్సింహయాదవ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు సమీపిస్తుండడంతో సబ్బండ వర్గాలను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నిస్తుందని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన ఆరోపించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జూనియర్ పంచాయతీ కార్యదర్శులను, వీఆర్‌ఏలను క్రమబద్ధీకరిస్తామని చెబుతున్నారని తెలిపారు. ఎనిమిది సంవత్సరాలుగా బీసీలను, ఆశ కార్యకర్తలు మోసం చేసింది సరిపోక మళ్లీ అబద్దపు హామీలు ఇస్తుందని మండిపడ్డారు.

విద్యార్థులకు సన్మానం

షాద్‌నగర్: పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మంగళవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని రిలయన్స్ ట్రెండ్స్ స్టోర్ మేనేజర్ సిరాజుద్దీన్ శ్రీచైతన్య, అభ్యాస్, నారాయణ, ఠాగూర్ పాఠశాల విద్యార్థులు వరుణ్ సందేశ్, శ్వేత, విష్ణుచరణ్, అతియా బేగం, ప్రదీప్తి, గౌతమ్, సతీష్, నౌమాన్, ఐశ్వర్య, అరవింద్‌లను సన్మానించి వారికి మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు.

జీఓ 111పై ప్రజల్లోకి వచ్చి మాట్లాడాలి

బీఆర్‌ఎస్ నాయకుడు వెంకట్‌రెడ్డి

మణికొండ: మూడు దశాబ్దాలుగా 84 గ్రామాల ప్రజలు జీఓ 111ను ఎత్తివేయాలని చేసిన ఉద్యమాలను లెక్క చేయకుండా జీఓను ఉంచాలని మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దమ్ముంటే ఆయా గ్రామాల ప్రజల్లోకి వచ్చి చెప్పాలని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకట్‌రెడ్డి సవాల్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డికి పిచ్చి ముదిరిందని వెంటనే ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేర్పించి వైద్య పరీక్షలు చేయించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు సుదీర్ఘ పోరాటం తరువాత ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ నేతగా, ఉద్యమకారుడిగా ఇచ్చిన హామీ ముఖ్యమంత్రి అయ్యాక కేసీఆర్ జీఓ 111ను తొలగించారు. ఓర్వలేక ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

సంక్షిప్త వార్తలు

▲ సీనియర్ అసిస్టెంట్‌ను నియమించండి

నందిగామ: మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గత కొన్ని నెలలుగా సెలవుపై వెళ్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు సంబంధించిన రైతులు భూ సమస్యలతో అనునిత్యం రెవెన్యూ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో సుమారు 6 నెలల నుంచి సీనియర్ అసిస్టెంట్ సెలవుపై వెళ్లడంతో ఆ కుర్చీ ఖాళీగా దర్శనమిస్తోంది. దీంతో ఉన్న అధికారులకు పనిభారం పెరగడమే కాకుండా, మండల ప్రజలు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సీనియర్ అసిస్టెంట్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

▲ అధికారుల సూచనలు పాటించాలి

వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్

కేశంపేట: రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటించి లాభాసాటి వ్యవసాయం చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అల్వాల క్లస్టర్ రైతులకు అల్వాలలోని రైతు వేదికలో వానా కాలం పంట సాగుపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ.. రైతులు పచ్చిరొట్ట పంటలైన జీలగ, జనుము పంటలను సాగు చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం రైతులకు 65శాతం సబ్సిడీపై విత్తనాలను అందజేస్తుందని తెలిపారు. పచ్చిరొట్ట పంటలను సాగు చేయడం వల్ల భూమిసారం పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, మహేశ్, శంకరయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

▲ 111 జీఓను ఎన్నిసార్లు ఎత్తేస్తారు..

బీజేపీ నాయకుడు మధుసూదన్‌రెడ్డి

మొయినాబాద్: 111 జీఓను ప్రభుత్వం ఎన్నిసార్లు ఎత్తేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత సంవత్సరం సీఎం కేసీఆర్ 111 జీవోను ఎత్తేస్తున్నామంటూ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి 69 జీఓను తెచ్చారన్నారు. 69 జీఓ విధివిధానాలు చెప్పకుండానే 111 జీఓ ఆంక్షలే కొనసాగుతాయని హైకోర్టుకు తెలిపారని గుర్తు చేశారు. ఒక్క 111 జీఓను ఎన్నిసార్లు ఎత్తేస్తారని.. 69 జీవో ఏమైందని ప్రశ్నించారు. 111 జీఓను ఎన్నికల కోసం వాడుకుంటూ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఎమ్మెల్యే కాలె యాదయ్య ఏ ముఖం పెట్టుకుని గ్రామాల్లో తిరుగుతున్నారని మండిపడ్డారు.

▲ దేవాలయం నిర్మాణానికి విరాళాల సేకరణ

చేవెళ్ల: అయ్యప్పస్వామి ఆలయం నిర్మాణంలో భాగంగా మండలంలో దాతల విరాళాల కోసం నిర్వహించిన స్వామివారి రథయాత్రలో ఈర్లపల్లి సర్పంచ్ రాజశేఖర్ లక్షరూపాయల విరాళం అందజేశారు. మండలంలోని ఈర్లపల్లిలో మంగళవారం శంకర్‌పల్లి అయ్యప్పసేవాసమితి ఆధ్వర్యంలో స్వామివారి రథయాత్రను ఊరేగించారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ.. శంకర్‌పల్లిలో అయ్యప్పస్వామి దేవాలయం నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నామని చెప్పారు. దాతలు స్వామివారి సేవలో భాగస్వాములు అయ్యేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.